అతీగతీ లేని సుందరీకరణ


గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఫౌంటెయిన్‌లో పేరుకుపోయిన చెత్త


కరెంటాఫీస్ సెంటర్ ప్రధాన రహదారి వద్ద..

• నిరుపయోగంగా ఫౌంటెయిన్లు

నగర సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్లు అతీగతీ లేకుండా పోయింది. నగరంలోని పలు ప్రధాన కూడళ్లల్లో వాటర్ ఫౌంటెయిన్‌లను ఏర్పాటు చేశారు. రూ.లక్షల నగదు వెచ్చించి వీటిని నిర్మించారు. అయితే నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఫౌంటెయిన్లు నిరుపయోగంగా చెత్తా చెదారాలకు ఆవాసంగా మారింది. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సొంత నియోజకవర్గమైన నెల్లూరు నగరంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొంటే ఇతర మున్సిపాలిటీల సంగతిని అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే వీటికి మరమ్మతులు చేసి నూతన హంగులతో మళ్లీ ప్రారంభించాలని నగర వాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


ఏసీ సెంటర్ వద్ద కళావిహీనంగా ఫౌంటెయిన్


పూలే విగ్రహం వద్ద నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫౌంటెయిన్


ఏసీ సెంటర్ వద్ద..


వీఆర్సీ సెంటర్‌లోని ఫౌంటెయిన్‌లో చెత్తా చెదారాలు

క్లుప్తంగా

అసమానతలు తొలగాలి


మాట్లాడుతున్న కోడూరు సత్యం

నెల్లూరు(బృందావనం) : సమాజంలోని అసమానతలను తొలగించేందుకు 'సమరసత వేదిక' పనిచేస్తుందని ఆ వేదిక జిల్లా అధ్యక్షుడు కోడూరు సత్యం తెలిపారు. ఫత్తేఖాన్‌పేట రమేష్‌రెడ్డి నగర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ శ్రేయస్సు, సంక్షేమం కోసం గుర్రం జాషువా, బోయిభీమన్న తదితరులు వారి రచనల ద్వారా ఎంతో కృషి చేశారన్నారు. వారిని స్మరిస్తూ సెప్టెంబర్ 19 నుంచి 28వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలు, విద్యార్థుల వసతి గృహాల్లో వ్యాస రచన, పద్య పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు లక్ష్మీనారాయణ, మాధవరావు, ఎం.శ్రీనివాసులు, జయప్రకాష్, సుబ్బరాయలు, జయప్రద, భవాని, డి.రాజేంద్ర, కృష్ణమూర్తి, సతీష్, శంకరయ్య, జి.కేశవులు పాల్గొన్నారు.

నగరంలో గైనకాలజిస్టుల సెమినార్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని హోటల్ మినర్వాలో గైనకాలజిస్టుల సెమినార్‌ను ఆదివారం నిర్వహించారు. జిల్లా గైనకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన గైనకాలజిస్టులు సెమినార్‌లో పాల్గొని, ప్రసంగించారు. పలు సూచనలు, సలహాలు అందించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ పల్లంరెడ్డి యశోధర, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీ జిల్లా సమావేశం



నెల్లూరు(బృందావనం) : స్థానిక లస్సీసెంటర్‌లో ఉన్న జీవీఎస్ కాంప్లెక్స్‌లో ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్(ఏఐఎఫ్‌బీ) జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఏఐఎఫ్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు బి.సుభాష్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు మాట్లాడారు. దేశంలోని అసమానతలు, దుర్గతులు తొలగాలంటే నేతాజీ సుభాష్‌చంద్రబోస్ భావజాలమే మార్గమని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా పాశం నరసింహారావు, కో-కన్వీనర్‌గా పి.లీలామోహన్ మరో తొమ్మిది మంది సభ్యులుగా నియమితులయ్యారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సీహెచ్.ఆనందబాబు, వీవీఎస్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సామగ్రి వితరణ



నెల్లూరు(బృందావనం) : విజయవాడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో గాండ్ల, తెలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సామగ్రి, దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హాజరై, నగరంలోని 400 గాండ్ల, తెలికుల కుటుంబాలకు సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు చిట్యాల సూర్యనారాయణ, వివిధ జిల్లాలకు చెందిన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే


సన్మానం అందుకున్న విశ్రాంత ఇంజినీర్లు


జ్ఞాపికలు అందుకున్న విశ్రాంత ఇంజినీర్లు

నెల్లూరు(బృందావనం) : పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లా ప్రజా వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే, 'ఇంటర్నేషనల్ ఫస్ట్ ఎయిడ్ డే'లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజినీర్స్ డే సందర్భంగా విశ్రాంత ఇంజినీర్లు ఎంఎస్ నాయుడు, ఆంజనేయులను ఘనంగా సత్కరించామన్నారు. ఇంటర్నేషనల్ ఫస్ట్ ఎయిడ్ డేను పురస్కరించుకుని నారాయణ హాస్పిటల్ గుండెవ్యాధి నిపుణుడు గోపాలకృష్ణ పలు సూచనలు చేశారన్నారు. వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఇంజినీర్‌లను, డాక్టర్ గోపాలకృష్ణను, ఆగస్టు, సెప్టెంబర్ నెలలో జన్మించిన వాకర్స్‌ను సన్మానించామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ భాస్కర్‌రెడ్డి, టి.నారాయణరెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, ఎమ్వీ కృష్ణయ్య, బి.రాజగోపాల్, సీఎల్ ప్రసాద్, వీఎస్ ప్రసాద్, మేరీ బ్లెస్సింగ్టన్, టి.రమణమూర్తి, కె.ఖాసీం, పి.బాలు, వి.బాలు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

బీవీనగర్‌లోని పెన్షనర్స్ సంక్షేమ భవనంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే, పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం గౌస్ మాట్లాడుతూ దేశం గరి్వంచదగ్గ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. ఇందులో భాగంగా తమ అసోసియేషన్‌కు చెందిన 14 మంది విశ్రాంత ఇంజినీర్లను జ్ఞాపికలతో సన్మానించామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఈఈ రామిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్వీవీఎస్ మూర్తి, ఉపాధ్యక్షుడు గురునాథం, టీమ్ లీడర్ కామయ్య, బాబురెడ్డి, డీఈ నజీర్‌బాషా, అసోసియేషన్ కోశాధికారి హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏబీవీపీ కార్యవర్గ సమావేశాలు


రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నాయకులు

నెల్లూరు (టౌన్) : రంగనాయకులపేటలోని బులియన్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఇందులో ఏబీవీపీ కార్యక్రమాత్మక విశ్లేషణ, సభ్యత్వం, సంఘటనాత్మక విశ్లేషణ తదితర వాటిపై చర్చించారు. ఈ సమావేశాలకు ఏబీవీపీ అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ, ఏపీ అధ్యక్షుడు మురళీధరరావు, కార్యదర్శి యాచేంద్ర, సంఘటనా కార్యదర్శి సుమన్ రాష్ట్రంలో విద్యారంగంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం సూచనలు సేకరించారు. అనంతరం విద్యారంగ స్థితిపై రెజల్యూషన్‌ను విడుదల చేసినట్లు ఏబీవీపీ జిల్లా నేత రాహుల్ తెలిపారు.

నరసింహకొండపై విశేష పూజలు


వామన విగ్రహం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లూరు సిటీ : నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద ఉన్న వామన విగ్రహం వద్ద ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వామన జయంతి సందర్భంగా నరసింహకొండ రోడ్డు మార్గంలో ఉన్న విగ్రహం వద్ద అర్చకులు పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రధాన అర్చకుడు భాస్కరా చార్యులు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అర్చకుడు కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



నెల్లూరు (టౌన్) : ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను స్థానిక పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. అనంతరం వారు చేసిన సేవలను కొనియాడారు. సన్మానం అందుకున్న వారిలో వెంకటరాజు, రఫీ, సైమన్‌కుమార్, సుబ్బారావు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలయ్య, నాయకులు శ్రీనివాసులు, రవిచంద్ర, చంద్రశేఖరరెడ్డి, వెంకటేశ్వర్లు, మునిరాజాచార్యులు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్ష లోగో ఆవిష్కరణ


మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : రూరల్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా ఆరోగ్య రక్ష లోగోను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించడమే లక్ష్యంగా టీడీపీ నేత దాట్ల చక్రధర్‌రెడ్డి కన్వీనర్‌గా ఆరోగ్య రక్ష అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రూరల్ పరిధిలోని పేదలకు ఉచితంగా వైద్యం అందేలా చేస్తామన్నారు. 22న దేవరపాళెంలోని కార్యక్రమాన్ని మొదలు పెడుతామన్నారు. కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.50 వేల విరాళం



నెల్లూరు(బృందావనం) : విజయవాడ వరద బాధితుల కోసం వీఆర్సీ జాలివాకర్స్ క్లబ్ తరఫున రూ.50 వేల విరాళాన్ని అందజేసినట్లు ఆ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజశేఖర్. పి.శ్రీరాములు ఆదివారం తెలిపారు. ఈ మొత్తాన్ని డీడీ ద్వారా కలెక్టర్ ఆనంద్‌కు అందజేశామన్నారు. కార్యక్రమంలో సభ్యుడు బాలాజీ పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరుని కల్యాణం



నెల్లూరు(బృందావనం) : శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని బాలాజీనగర్‌లోని సీతారామ స్వామి మందిరంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. తొలుత స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉభయదేవేరులతో కొలువైన కల్యాణ వెంకటేశ్వరుని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా తాతా వెంకటకిశోర్‌కుమార్, హేమలత దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మందిర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ ఓబేద్ అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. అపోలో హాస్పిటల్స్ వారి సౌజన్యంతో నిర్వహించిన సదస్సుకు అపోలో హాస్పిటల్ న్యూరో సర్జన్, సీనియర్ డాక్టర్ షేక్ ఓబేద్ అహ్మద్ హాజరై న్యూరో సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంత రామారావు, సెక్రటరీ గుర్రం వెంకట సురేంద్ర బాబు, కోశాధికారి సాయిరాం, గౌరవాధ్యక్షుడు తిరుపతి నాయుడు, మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో రచయిత సీహెచ్‌వీ బృందావనరావు రచించిన 'శ్రీమత్ సుందరకాండం' అనే పుస్తకాన్ని సూరం శ్రీనివాసులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ 15 వేల పద్యాలతో సుందరకాండమును అత్యంత రమణీయంగా తీర్చిదిద్దిన బృందావనరావు పాండిత్య ప్రతిభ ప్రశంసనీయమన్నారు. పద్యకళా పరిషత్ అధ్యక్షుడు ఎం.రామచంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎ.సుబ్బారావు, ఎస్ఎస్ఆర్కే ప్రసాద్‌రావు, ఈతకోట సుబ్బారావు పలువురు రచయితలు, కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు సిటీ: స్థానిక భగత్ సింగ్ కాలనీలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పేకాట ఆడుతున్న 13 మంది, నిర్వాహకులైన ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.18,000లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అనధికార ఫ్లెక్సీలు.. ఆదాయానికి తూట్లు

- ఫ్లెక్సీల ఏర్పాటులో పారదర్శకత ఏదీ?
- అధికార నేతలకు ఒకలా.. విపక్షాలకు మరోలా నిబంధనలు
- పట్టించుకోని అధికారులు


ఫ్లైఓవర్ కింద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో..

నెల్లూరు(బారకాసు) : నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పుట్టినరోజు వేడుకలు, వర్ధంతులకు పెద్ద ఎత్తున ఫ్లెక్సీల ఏర్పాటు పరిపాటి. అయితే వాటి ఏర్పాటు, తొలగింపులో యంత్రాంగానికి ఒక విధానమంటూ లేకుండాపోయింది. నగర, మున్సిపాలిటీల్లో ఎవరైనా ఫ్లెక్సీలు, పోస్టర్లను అనుమతి ఉన్న బోర్డుల వద్దే ఏర్పాటు చేసుకోవాలి. అయితే ప్రధాన రహదారులు మొదలుకుని బహిరంగ ప్రదేశాలు, సందు గొందుల్లో సైతం వాటిని కట్టి జనాల రాకపోకలకు అసౌకర్యం కలిగించేలా ఏర్పాటు చేస్తున్నా వాటిని తొలగించే చర్యలు చేపట్టడం లేదు.

విపక్షాలకే నిబంధనలు

నగరపాలక సంస్థ పరిధిలో విపక్షాలకు చెందిన ఫ్లెక్సీలను అధికార యంత్రాంగం కక్షగట్టి మరీ తొలగించేస్తున్నారు. అయితే అధికార పక్షం వారు ఏర్పాటు చేస్తే మిన్నకుండిపోతున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నేతలు అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మాత్రం రోజుల తరబడి ఉంచినా కన్నెత్తి చూడడం లేదు. దీంతో నగరమంతా ఫ్లెక్సీల మయమవుతోంది. అంతేకాకుండా యువత తమ స్నేహితుల జన్మదినోత్సవాల సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇబ్బడి ముబ్బడిగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. అదే విపక్షాల విషయంలో ఎక్కడా లేని నిబంధనలు అమలు చేస్తున్నారు.

విమర్శల పాలవుతున్న అధికారుల వైఖరి

నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులైన జీఎన్‌టీ రోడ్డు, మినీ బైపాస్‌రోడ్డులో ఉన్న డివైడర్లలో మొత్తం అధికారికంగా 600 వరకు లాలిపప్‌లు, అలాగే 15 హోర్డింగ్‌లు ఉన్నాయి. వీటిని 15 ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. వాటి నుంచి ఏడాదికి రూ.1.45 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో వీటి సంఖ్యను పెంచుకుంటే ఆదాయం పెరుగుతుంది. నగరంలో ప్రధాన ప్రాంతాలైన ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, ట్రంకురోడ్డు, గాంధీ బొమ్మ సెంటర్, వీఆర్సీ కూడలి, మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, కేవీఆర్ పెట్రోల్ బంకు సెంటర్, కరెంటాఫీస్ సెంటర్, వేదాయపాళెం, అయ్యప్పగుడి, అన్నమయ్య సర్కిల్, బీవీనగర్ సెంటర్, వనంతోపు సెంటర్, ముత్తుకూరు బస్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. అనధికారికంగా అనుమతించడం వల్ల ఆదాయం లేకుండాపోయింది. ఫ్లెక్సీల వల్ల ప్రమాదాలతో పాటు శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, అందువల్ల అనుమతి ఇవ్వకూడదని గతంలో అధికారులు నిర్ణయించారు. కొంతకాలంగా అధికార పార్టీ విషయంలో దీనిని పక్కన పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన రొట్టెల పండగ, వినాయక చవితి ఇలా పలు పండగల సందర్భాల్లో నగరంలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఎవరైనా మంత్రులు, ముఖ్య అతిథులు జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంలోనూ విచ్చలవిడి ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. వీటిని ఇలా రోజుల తరబడి ఉంచితే ఇబ్బందులు తప్పవని ప్రజలు, వాహనదారులు అంటున్నారు.

మామూళ్ల మత్తులో..

నగరంలో నూతన షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవం సందర్భంగా అనధికారిక ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. వీటి ఏర్పాటు కోసం టౌన్‌ప్లానింగ్ అధికారులకు మామూళ్లు వెళ్తుండడంతో వారు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు అనధికార ఫ్లెక్సీల ఏర్పాటుపై ప్రత్యేక నిఘా ఉంచి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.